క్లుప్తంగా

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత గుణశేఖర్

కార్వేటినగరం: మండలకేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుణశేఖర్, లత దంపతులు తమ కుమార్తె లిషికాశ్రీ మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం గుణశేఖర్ మాట్లాడుతూ తమ కుమార్తె పుట్టిన రోజుకు ఏటా వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తామని, వృద్ధులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి


వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు వరి సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం సీఎం కండ్రిగ గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి పొలంలో మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నందున పంటకు నష్టం లేదన్నారు. పంటలకు ఎక్కువగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు. వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని, తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడినట్లు అవుతుందన్నారు. వ్యవసాయ శాఖ అందించిన జింక్ సల్ఫేట్ బోరాన్ జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వరి, వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యజమాన్యాలపై చర్యల గురించి వివరించారు. రైతు సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

పాచిగుంట మనోహర్‌కు నివాళి


మనోహర్ నాయుడు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న విజయానంద రెడ్డి

గంగాధర నెల్లూరు: టీడీపీ మాజీ జిల్లా రైతు విభా గం అధ్యక్షుడు పాచిగుంట మనోహర్ నాయుడు మృతికి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి నివాళులర్పించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యం బారిన పడిన మనోహర్ నాయుడు చికిత్స పొందుతున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంసీ విజయానంద రెడ్డి పాచిగుంట గ్రామానికి వెళ్లి మనోహర్ నాయుడు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు బాడీబిల్డింగ్ పోటీలు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం యూత్ హాస్టల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఈశ్వరప్రకాష్, శివప్రసాద్ రాయల్ తెలిపారు. ఈమేరకు వారు పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడానికే పార్కుల ఏర్పాటు
- రూ.1.10 కోట్లతో పుత్తూరులో, రూ.39.5 లక్షల వ్యయంతో వడమాలపేటలో, రూ.80 లక్షలతో నగరిలో పార్కు ఏర్పాటు చేస్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా
- నగరిలో పార్కు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి


పార్కు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, తుడా వీసీ

నగరి: వినోదంతో కూడిన ఆనందాన్ని ప్రజలకు అందించేందుకే మున్సిపాలిటీల్లో పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం నగరి మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న పార్కును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, వృత్తి రీత్యా ఒత్తిడికి గురైన వారు, వయోవృద్ధాప్యంలో ఆహ్లాదకరమైన ప్రాంతంలో సేద తీరాలనుకున్న వారు పార్కు కోసం ఎదురు చూస్తారన్నారు. పార్కులు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పట్టణ ప్రమాణాలను పెంచుతుందన్నారు. గత ప్రభుత్వంలో పట్టణ ప్రమాణాలు పెంచే దిశగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.10 కోట్ల వ్యయంతో పుత్తూరులో మున్సిపల్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు రూ.24 లక్షల వ్యయంతో చిల్డ్రన్ పార్కుకు ప్రహరీగోడ నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.39.5 లక్షల వ్యయంతో వడమాలపేటలో తుడా పార్కు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నగరిలో రూ.80 లక్షల నిధులతో పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పార్కుకు సంబంధిత ప్రహరీ, ఆర్చి పనులు పూర్తయ్యాయని, పార్కులో నీటివసతి కోసం బోరు వేయడం జరిగిందన్నారు. త్వరలో మిగిలిన పనులు పూర్తవుతుందన్నారు. పరిశీలనలో ఆమె వెంట తుడా వైస్ చైర్మన్ హరికృష్ణ, డీఈలు కృష్ణారెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ విజేతలకు బహుమతి అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

ఆడుదాం ఆంధ్రాతో క్రీడలకు కిరీటం

నగరి: క్రీడలకు కిరీటం.. ఆడుదాం ఆంధ్రా పోటీలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి విజేతలకు బహుమతుల పంపిణీ నిమిత్తం క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బాలుర విభాగంలో నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కృష్ణసముద్రం, మాంగాడు, కళియంబాకం క్రికెట్ జట్లు నిలిచాయి. అలాగే గుండ్రాజుకుప్పం, వడమాలపేట, విజయపురం వాలీబాల్ జట్లను, వడమాలపేట, నగరి, పుత్తూరు ఖోఖో జట్లను, నిండ్ర, పుత్తూరు, విజయపురం కబడ్డీ జట్లు విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నగరి, నిండ్ర, పుత్తూరు కబడ్డీ జట్లు చూపిన ప్రతిభను ప్రశంసిస్తూ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభగల క్రీడాకారులను గుర్తించడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించే ఈ పోటీల ద్వారా క్రీడాకారులలోని ప్రతిభను వెలికి మంచి క్రీడాకారులను తయారు చేయడం జరుగుతుందన్నారు. అంతర్ జిల్లాల స్థాయి క్రీడలను కూడా నగరిలోనే నిర్వహించడం జరిగిందన్నారు. రూ.33.80 లక్షలతో నిండ్ర, విజయపురంలో జిమ్ నిర్మిస్తున్నామని, రూ.78 లక్షల నిధులతో పుత్తూరులో స్కేటింగ్ రింగ్ నిర్మాణంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, పీడీ గోపి, సురేష్, అంపైర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1న సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుంభాభిషేకం

- మంత్రి నారాయణస్వామి చొరవతో రూ.75 లక్షలతో ఆలయ ఆధునీకరణ
- మహా కుంభాభిషేకం నిర్వహణకు భారీగా ఏర్పాట్లు


మహా కుంభాభిషేకానికి సిద్ధమైన రాజగోపురం

కార్వేటినగరం: సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన స్కంధపుష్కరిణి సమీపంలో కార్వేటినగరానికే మణిహారంగా నిలుస్తున్న, కుమారగిరిపై వెలసిన వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో 1వ తేదీ మహా కుంభాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కంచికామకోటి పీఠాధిపతి జయేంద్రసరస్వతి చేతుల మీదుగా ఆలయ పునఃనిర్మాణానికి పునాదులు వేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవ తీసుకుని రూ.75 లక్షలు మంజూరు చేయించి ఆలయ ఆధునీకరణ పనులు చేపట్టారు. అందులో ఆలయం చుట్టు ప్రహరీ నిర్మాణానికి రూ.45 లక్షలు, అలాగే ఆలయంలో ఫ్లోరింగ్, రాజగోపురం ఆధునీకరణకు రూ.35 లక్షలు వెచ్చించడం జరిగింది. స్కంధపుష్కరిణి నుంచి ఆలయ సమీపం వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి దాతలు కూడా ముందుకు వచ్చినట్లు చెప్పారు.

నేటి నుంచి కుంభాభిషేక కార్యక్రమాలు

30వ తేదీ మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటలలోపు వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం ఉంటుంది. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు సహస్రనామార్చన, ఆరాధన, మహా మంగళ హారతి నిర్వహిస్తారు. అలాగే 31వ తేదీ బుధవారం 7 గంటల నుంచి 9 గంటల వరకు స్వామివారికి అభిషేకం, ఆరాధన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, రాజగోపురంపై కలశ స్థాపన, ఉంటుంది. 1వ తేదీ గురువారం ఉదయం 10.55 గంటల నుంచి 11.59 గంటల లోపు స్వామివారి ఆలయ సంప్రోక్షణ, రాజగోపురం మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి కార్యవర్గంలోకి అనిల్


అనిల్ కుమార్

నిండ్ర: చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదేశాల మేరకు జిల్లా యువజన విభాగం కమిటీని నియమించింది. అందులో నగరి నియోజకవర్గంలోని నిండ్ర మండలం కొప్పేడు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ ఉన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ పదవి రావడానికి కృషి చేసిన మంత్రి రోజాకు, నాయకులకు కృతజ్ఞతలు అన్నారు.

జలజీవన్ మిషన్ లక్ష్యంపై సమీక్ష


జలజీవన్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్

పాలసముద్రం: జలజీవన మిషన్ కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ గ్రామ జలసంఘం సభ్యులేనని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జలసంఘ గ్రామ పంచాయతీ సభ్యులకు మండల విస్తరణాధికారి రమేష్ సమక్షంలో సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ మాట్లాడుతూ కమ్యూనిటీ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా తాగునీటి సరఫరా పథకం అమలులో సామాజిక సమీకరణ పనుల నాణ్యత పెంచడం, నీటి సరఫరాను నిర్వహణలోకి వినియోగించడం గ్రామ జలసంఘ సభ్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. అందువల్ల జలసంఘం పంచాయతీ సభ్యులకు అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు. ఇందులో జలజీవన్ మిషన్ పనులు చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సంఘమిత్రాలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్నగగన్, తులసి యాదవ్

పాలసముద్రం: మండలకేంద్రంలోని కార్యాలయంలో ఏఓ విద్యావతి నేతృత్వంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు విడుదల చేసిందన్నారు. వాటిని అందజేయడానికి నేడు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి విచ్చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా చైర్మన్ పోలయ్య, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, ఉపాధిహామీ ఏపీఓ మార్గరెట్, అరుల్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం.. ఆంధ్రా పోటీలు ముగింపు



వాలీబాల్ విజేత జీడీనెల్లూరు జట్టుకు, కబడ్డీ పోటీల్లో మహిళా విభాగం విజేత శ్రీరంగరాజపురం జట్టుకు కప్పు అందిస్తున్న శ్రీదేవి,ఎంపీడీఓ సుధాకర్

- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రత్యేక అధికారి శ్రీదేవి


కబడ్డీ పోటీ విజేత పాలసముద్రం జట్టుకు కప్పును అందజేస్తున్న శ్రీదేవి, ప్రజాప్రతినిధులు


క్రికెట్ పోటీ విజేతలకు పతకం అందిస్తున్న అతిథులు

గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి పోటీలు అట్టహాసంగా ముగిశాయి. సోమవారం నియోజకవర్గ కేంద్రం గంగాధర నెల్లూరులో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి ముగింపు సమావేశాన్ని ఎంపీపీ హరిబాబు, గంగార నెల్లూరు గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతి యువకుల్లో క్రీడల పట్ల దాగిఉన్న ప్రతిభా పాట వాళ్లను వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి భారీ పారితోషికంతో పాటు జాతీయ జట్టులో కూడా తమ ప్రతిభను చూపించడానికి గొప్ప అవకాశం లభిస్తుందన్నారు.

విజేతలు వీరే..

కబడ్డీ పురుషుల విభాగంలో పాలసముద్రం జట్టు, మహిళల విభాగంలో శ్రీరంగరాజపురం జట్టు విజేతగా నిలిచాయి. క్రికెట్ పురుషుల విభాగంలో పెనుమూరు మండలం మొదటి స్థానం కైవసం చేసుకుంది. బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో వెదురుకుప్పం మొదటి స్థానంలో నిలిచింది. అలాగే వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో గంగాధర నెల్లూరు మండలం మొదటి స్థానంలో నిలువగా, ఖోఖో పోటీల్లో పురుషుల విభాగంలో కార్వేటి నగరం మండలం మొదటిస్థానంలో నిలువగా, మహిళా విభాగంలో పాలసముద్రం మండలం మొదటి స్థానంలో నిలిచాయి. క్రికెట్ పోటీల్లో మహిళల విభాగంలో పాలసముద్రం మండలం మొదటి స్థానంలో నిలిచింది. చివరి రోజున గంగాధర నెల్లూరు మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు రెండు జట్లుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్ ఆడగా సర్పంచుల జట్టుపై ఎంపీటీసీల జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో గెలిచిన ప్రతి ఒక్కరికీ రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రశంసా పత్రాలు, మెడల్స్, బహుమతులను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, నాయకులు మునిరాజారెడ్డి, గోవిందరెడ్డి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వేలు మొదలియార్, సర్పంచులు ఎంపీటీసీలు, వ్యాయామ ఉపాధ్యాయులు సెల్వ పాండియన్, నియోజక వర్గం నుంచి వచ్చిన ఆరు మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యురాలి తీరుపై నిరసన


బాధితులు అందించిన వివరాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ప్రభావతి

- ఆపరేషన్ సరిగా చేయలేదని ఆగ్రహం
- ఇప్పటికే మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు విచారణకు ఆదేశం
- విచారిస్తున్న కమిటీ
- సూపరింటెండెంట్ ప్రభావతి

నగరి: నగరి ఏరియా ఆస్పత్రిలోని ఒక వైద్యురాలికి వ్యతిరేకంగా గుండ్రాజుకుప్పం దళితవాడకు చెందిన వారు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ ఆస్పత్రిలో డెలివరీ నిమిత్తం వన్మతి అనే మహిళకు డెలివరీ నిమిత్తం ఆపరేషన్ జరిగిందని ఆపై ఆమె ఆరోగ్యానికి సంబంధిత పలు సమస్యలు ఎదురయ్యాయని ఆరోపించారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయని ఆమె వద్దకు విచ్చేసినా ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకున్నారు. వైద్యురాలు చేసిన ఆపరేషన్‌లో పొరపాటు జరిగిందన్న కోపంతో బాధితులు, వారు అనుచర వర్గాలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. సూపరింటెండెంట్ ప్రభావతి నిరసనకారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా కూడా ఈ విషయమై జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ కమిటీ విచారిస్తోందన్నారు. కమిటీ నిజానిజాలు తెలుస్తుందని, తప్పు జరిగి ఉంటే తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనకు ఇప్పటివరకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని జరిగిన విషయాలు తెలుపుతూ ఆధారాలు తనకు అందించాలన్నారు. సంబంధిత వైద్యులు బయటకు వచ్చి సమాధానం చెప్పాలంటూ బాధితులు కోరడంతో విచారణలో ఉన్న వైద్యులు అలా రాకూడదని సూపరింటెండెంట్ సమాధానమిచ్చారు. దీనిపై సంతృప్తి చెందని వారు తిరుపతి చెన్నై రహదారి రోడ్డుపై కూర్చుని ధర్నా చేశారు. సీఐ సురేష్ సిబ్బంది వచ్చి జాతీయ రహదారిపై కూర్చోరాదని, సమస్యను ఆస్పత్రిలో తేల్చుకోవాలని చెప్పడంతో బాధితులు గంట పాటు ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేసి వెనుదిరిగారు.

జిల్లా ఎస్టీయూలో నగరికి ప్రాధాన్యత



టీఎం సుబ్రమణ్యం, నాగభూషణం

నగరి: చిత్తూరులో సోమవారం నిర్వహించిన ఎస్టీయూ 77వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో నగరికి సముచిత స్థానం కల్పించినట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యవర్గంలో రాష్ట్ర కౌన్సిలర్లుగా మండలంలోని అడవి కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టీఎం సుబ్రమణ్యం, గుండ్రాజుకుప్పం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగభూషణం ఎన్నికైనట్లు చెప్పారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పవన్ కుమార్ రెడి, నగరి డివిజనల్ కన్వీనర్‌గా మాంగాడు పాఠశాల ఉపాధ్యాయుడు గిరిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మీరాసాహేబ్ పాళెం పాఠశాల ఉపాధ్యాయుడు గంగామోహన్, చింతలపట్టెడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహేంద్రన్, మైనారిటీ కమిటీ సభ్యుడిగా ఆర్‌సీజీ గణేశన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత, ఏఎన్‌ఎం రేవతి సమక్షంలో 104 వాహన సేవల్లో భాగంగా వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి డాక్టర్ మోహన్‌కృష్ణ అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రజలు చిన్నచిన్న వ్యాధులకు కూడా ఆస్పత్రికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో 104 వాహనం ద్వారా జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్ వంటి కొన్ని వ్యాధులకు వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రజలు 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 35 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు మెరుగైన సేవలు అందించండి

- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంపై అవగాహన
- ఎంపీపీ లత పిలుపు


ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత, అధికారులు

కార్వేటినగరం: రోగులకు మెరుగైన సేవలు అందించి రాష్ట్రప్రభుత్వం ఆశయాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోయేలా చూడాలని ఎంపీపీ లత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చిన్ననగర్ వీధిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యకేంద్రం నిర్వహణకు పెద్దపీట వేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్వేటినగరం మండలంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గ్రామస్థాయిలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసిందన్నారు. అనంతరం వైద్యాధికారి భవానీ మాట్లాడుతూ నూతనంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విషయాన్ని వలంటీర్లు, ఆశావర్కర్లు, క్షేత్రస్థాయిలోకి ప్రచారం చేసి అమాయక ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు పడకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈక్రమంలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఎంపీపీ లత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే వైద్యసిబ్బంది ఎంపీపీని శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉపసర్పంచ్ శేషాద్రి, ఎంపీడీఓ మోహన్‌మురళి, డాక్టర్లు గోపీనాథ్, హేమశ్రీ, యూసఫ్, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఈఓపీఎస్ మణి, అంబరీష్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, లత పలువురు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో డీబీటీ బిల్డర్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఆన్ జినోమిక్స్ అండ్ బయోలాజికల్ డేటా బేసిస్ అనే అంశంపై సోమవారం వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి హాజరయ్యారు. స్కూల్స్ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, డీన్ ప్రొఫెసర్ సుజాత, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, ప్రొఫెసర్ ఆర్ ఉషా, డాక్టర్ దీప్షిక్ సతీష్, డాక్టర్ సుదర్శన్ వరదరాజన్, డాక్టర్ పీర, డాక్టర్ స్వామి, శ్రీదేవి, ప్రొఫెసర్ స్వర్ణలతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ లైవ్లీ హుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌లో ఫిబ్రవరి రెండో వారం నుంచి ప్రారంభం కానున్న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కోసం ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధితో శిక్షణ ఉంటుందని ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 98852 44006 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.